క్లుప్తంగా

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



పాన్‌గల్: ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ అర్హులైన పేదవారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలోని అర్హుల వివరాలను ఆయన పరిశీలించారు. జాబితాలో ఉన్న వారు పేదవారా, ఇల్లు ఉందా లేదా అనే విషయాలను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుర్మన్న పాల్గొన్నారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకొచ్చిన తెలంగాణ భూ భారతి చట్టంపై శనివారం మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సత్యానారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ హాజరవుతారన్నారు. సదస్సుకు ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



ఆత్మకూర్: షహీద్ భగత్‌సింగ్ త్యాగాలు మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు యువత సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు ప్రసాద్, హన్మంతు, రాజు అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో భగత్‌సింగ్ జీపుజాతాను నిర్వహించారు. ఈ నెల 5న మక్తల్ పట్టణంలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, వెంకటయ్య, అంజన్న తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



వనపర్తిటౌన్: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు పొందుతారని, ఉత్తమ ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఇటీవల కండక్టర్, సీఆర్సీగా పనిచేసి పదవీ విరమణ పొందిన వి.శ్రీనివాసులును ఆయన స్వగృహంలో శుక్రవారం సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రతినిధులు సూర చంద్రశేఖర్, గణేశ్ కుమార్, రిటైర్డ్ ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, డి. రాములు, బైరోజు చంద్రశేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిన్నంబావి: మండలంలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన సెహనాజ్ బేగం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్నారు. ఆస్పత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, హన్మంత్‌రావు, భగవంతు, చుక్కరావు, తిరుపాల్‌రావు, నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కడీలు పాతిన వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: అక్రమంగా పొలంలో కడీలు పాతి, డబ్బులు, భూమి డిమాండ్ చేసిన ఘటనలో శుక్రవారం కేసు నమోదైనట్లు ప్రొహిబిషన్ ఎస్‌ఐ హిమబిందు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేమద్దులకు చెందిన శ్రీరాంరెడ్డికి గ్రామ శివారులోని సర్వే నంబర్ 468లో 4.20 ఎకరాల భూమి ఉంది. ఆయన స్థానికంగా లేకపోవడంతో ఇదే గ్రామానికి చెందిన రంగాపురం సుధాకర్‌రెడ్డి 10 రోజుల క్రితం శ్రీరాంరెడ్డి పొలంలో 15 సిమెంటు కడీలు పాతి భూమి అక్రమించే ప్రయత్నం చేశాడన్నారు. విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న శ్రీరాంరెడ్డి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నిందితుడిపై ఫిర్యాదు చేశాడు. పొలంలో కడీలు పాతడంతో పాటు గతంలో దౌర్జన్యంగా డబ్బులు, భూమి డిమాండ్ చేసిన రంగాపురం సుధాకర్‌రెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిండా మునిగిన మామిడి రైతులు

- ఈదురుగాలులతో వందల ఎకరాలలో నేలరాలిన కాయలు
- పరిహారం కోసం ఎదురు చూపులు
- చీడపీడలతో తగ్గిన దిగుబడి



వీపనగండ్లలో దిగుబడి తగ్గిన మామిడి తోటలు



గోవర్ధనగిరిలో నేలరాలిన కాయలను ఏరుతున్న రైతులు (ఫైల్)

వీపనగండ్ల: మండలంలో ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలకు మామిడి రైతు నిండా మునిగాడు. మండల వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. గాలుల కారణంగా చేతికి వచ్చిన మామిడి కాయలు నేలరాలి తీవ్రంగా నష్టపోయారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి చీడపీడల నుంచి తోటలను కాపాడుకుంటూ కొద్దిపాటిగా వచ్చిన దిగుబడిని విక్రయించుకోవాలన్నా సుదూరప్రాంతాలకు తీసుకెళ్లి దళారులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో పెట్టిన పెట్టుబడులు చేతికి రాక ఆర్థిక ఊబిలో కూరుకుపోతున్నామని, కనీసం నేలరాలిన మామిడికాయలకైనా పరిహారం చెల్లించి ఆదుకోవాలని మామిడి రైతులు, కౌలుదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

229 ఎకరాలలో నష్టం

ఈదురు గాలులతో మండలంలోని 9 గ్రామాల్లో 290 మంది రైతులకు సంబంధించిన 229 ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని ఉద్యానవన అధికారులు లెక్కలు చూపించారు. 33 శాతం కంటే ఎక్కువగా నష్టపోయిన తోటలను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పుతున్నారు. సంగినేనిపల్లిలో 32 మంది రైతులకు చెందిన 22.9 ఎకరాలు, పుల్గర్‌చర్లలో 29 మంది రైతులకు చెందిన 23.26 ఎకరాలు, కల్వరాలలో ఏడుగురుకి చెందిన 8.08 ఎకరాలు, వీపనగండ్లలో 52 మందికి చెందిన 44.11 ఎకరాలు, తూంకుంటలో 58 మందికి చెందిన 44.02 ఎకరాలు, సంపత్‌రావుపల్లి ముగ్గురికి సంబంధించిన 2.14 ఎకరాలు, గోవర్ధనగిరి 101 మందికి చెందిన 76.27 ఎకరాలు, గోపాల్‌దిన్నె ఐదుగురికి చెందిన 4.28 ఎకరాలు, వల్లభాపురం ముగ్గురికి చెందిన 2.35 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.

దళారీలతో అధిక నష్టం

వచ్చిన కొద్దిపాటి మామిడి కాయలను విక్రయించుకోవాలన్నా హైదరాబాద్ పట్టణానికి తీసుకువెళ్లాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కేంద్రప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రకటించిందని కొల్లాపూర్ పట్టణంలో మార్కెట్ వసతులు ఏర్పాటు చేస్తామని రెండేళ్లుగా అధికారులు ప్రకటనలు గుప్పించినా నేటికీ మార్కెట్ వసతులపై ఒక్క అడుగు ముందుకు పడలేదు. రవాణా, తరుగు, కమీషన్ పేరుతో 30 శాతం డబ్బులను కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



రూ.10 లక్షలు వెచ్చించి నాలుగు తోటలను కౌలుకు తీసుకున్నాను. చీడపీడలు, కోతుల బెడదతో పాటు వారం రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు 30 శాతం కాయలు నేలరాలాయి. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా పలువురు కౌలుదారులు నష్టపోతున్నారు. కౌలుదారులను గుర్తించి ప్రత్యేక పరిహారం అందజేయాలి.

– శనమోని ఈదన్న, మామిడి తోటల కౌలుదారు, వీపనగండ్ల

నిబంధనలు సడలించాలి



33 శాతం కంటే ఎక్కువగా నష్టపోయిన తోటలను మాత్రమే పరిహారానికి ఎంపిక చేస్తామన్న నిబంధన తొలగించాలి. చిన్న, సన్నకారు రైతులకు మేలు జరుగాలంటే నేలరాలిన ప్రతి మామిడి కాయను లెక్కలోకి తీసుకొని పరిహారం అందివ్వాలి. ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలి.

– బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి, వీపనగండ్ల

పంట నష్టం అంచనా వేశాం



నిబంధనలతో పాటు ఉన్నతాధికారుల ఆదేశానుసారం నష్టపోయిన మామిడి తోటలను గుర్తించి నివేదికలు పంపించాం. ఈదురుగాలులతో నష్టపోయిన పంటలకు పరిహారాన్ని చెల్లిస్తే మామిడి రైతులకు మేలు జరుగుతుంది. మామిడి మార్కెట్ ఏర్పాటుపై మరోమారు ఉన్నతాధికారులకు విన్నవిస్తాం.

– కృష్ణ, మండల ఉద్యానవన శాఖ అధికారి, వీపనగండ్ల

ఇందిరమ్మ ఇళ్లకు మోక్షమెన్నడో?



మాట్లాడుతున్న కొమ్ము భరత్‌భూషణ్

కొత్తకోట: ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు తీసుకొని ఇప్పటికి 13 నెలలు పూర్తవుతున్నా.. ఆరు నెలల క్రితం మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ గ్రామంగా ప్రకటించినా ఇంతవరకు ఇందిరమ్మ ఇళ్లకు మోక్షం కలగలేదని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ భరత్‌భూషణ్ అన్నారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్తకోట మండలంలో రామంతపురం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంచుకొని 66 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినప్పటికీ ముగ్గురు మాత్రమే పనులు ప్రారంభించారని ఆయన తెలిపారు. పేదరికం కారణంగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించలేకపోయారని వాపోయారు. ఇందిరా క్రాంతి పథకం కింద లబ్ధిదారులందరికీ రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఏమాత్రం సరిపోవని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, పైరవీకారులు సూచించిన వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని, అందుకే అధికారులు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉండేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో కొత్తకోట పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆవుల రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

టోకెన్ల జారీలో నిబంధనలు సడలించాలి



పాన్‌గల్ రైతువేదికలో ధాన్యం టోకెన్ల కోసం గుమికూడిన రైతులు

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే వ్యవసాయ శాఖ వారు అందజేసే టోకెన్ల జారీలో ఉన్న నిబంధనలు సడలించాలని మండల రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ టోకెన్లు జారీ చేస్తేనే కేంద్రాల్లో ధాన్యం కాంటా చేస్తున్నారని, ఈ టోకన్ల జారీలో ఎకరాకు 32 క్వింటాళ్ల చొప్పున (కుంటకు 02 బస్తాల చొప్పున) దిగుబడి వస్తుందనే అంచనాలతో అధికారులు టోకెన్లను జారీ చేస్తున్నారు. కానీ వాస్తావానికి ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. మరి మిగిలిన 3 క్వింటాళ్ల ధాన్యం ఏమి చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎకరాకు ఉన్న నిబంధనలను సడలించి టోకెన్లను అందజేసి ఇబ్బందులను తొలగించాలని మండల రైతులు కోరుతున్నారు. శుక్రవారం చాలా మంది రైతులు టోకన్ల జారీ విషయంలో ఏఈఓలను ప్రశ్నించారు. ఈ విషయంపై ఏఓ రాజవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. ప్రభుత్వం ఎకరాకు 32 క్వింటాళ్ల దిగుబడి లెక్కన టోకెన్లను అందజేస్తున్నామని రైతుల అభిప్రాయాలను జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



గోపల్‌దిన్నెలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాల్‌రెడ్డి

వీపనగండ్ల: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఏపీఎం బిచ్చన్న సూచించారు. శుక్రవారం గోపల్‌దిన్నెలో మండల మహిళా సమైఖ్య ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన గ్రామ మహిళా సమైఖ్య సభ్యులతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీసీ వీరయ్య పాల్గొన్నారు.

జాప్యం లేకుండా చూడాలి

గోపాల్‌పేట: రైతులకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్, నాయకులు గోపాలకృష్ణ, చంద్రయ్య అన్నారు. శుక్రవారం వారు ఏదుట్లలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. లారీలు రాకపోవడంతో 3,500 బస్తాల ధాన్యం తరలింపు ఆగిపోయిందని తెలుసుకుని డీఎస్ఓతో ఫోన్‌లో మాట్లాడారు. అకాల వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తరలించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్ర కుర్మయ్య, నాగన్న, యాదయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

గోపాల్‌పేట: ఏదుల ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌కు గోపాల్‌పేట ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఎంఈఓ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల పదవీ విరమణ పొందగా.. ఆయన స్థానంలో శుక్రవారం ప్రభాకర్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు విధిగా పాల్గొని, ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. అనంతరం ఏదుల మండలంలోని చెన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీవాణి పదో తరగతిలో 503 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. చెలిమి సంస్థ అధ్యక్షుడు సిద్ధి రవితో కలిసి శ్రీవాణి ఇంటి వద్దకు వెళ్లి విద్యార్థిని సన్మానించి అభినందించారు.

కార్మికుల రాజ్యం వచ్చేదాకా పోరాడుదాం



కేతేపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు



అమరచింతలో బీఆర్టీయూ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: కార్మికుల రాజ్యం వచ్చేదాకా పోరాటాలు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. మే డే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కేతేపల్లిలో ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల పక్షాన ఉంటూ వారి సంక్షేమం కోసం ఎర్రజెండా ఎన్నో పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. కూలీ కోసం, భూమి పోరాటాలు, స్థానిక సమస్యల పరిష్కారంపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూ ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. రాబోయే కాలంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, స్థానిక సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమాలల్లో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భీమయ్య, రాము, మండ్ల కృష్ణయ్య, నరేందర్ పాల్గొన్నారు.

సీపీఎం, బీఆర్టీయూ ఆధ్వర్యంలో..

అమరచింత: పట్టణంలో శుక్రవారం మే డే ఉత్సవాలను సీపీఎం, బీఆర్టీయూ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. ఈమేరకు పట్టణంలోని 9 వార్డులో ఉన్న సీపీఎం జెండాను మాజీసర్పంచ్ గోపాల్ చేతుల మీదుగా ఆవిష్కరించగా.. బీఆర్టీయూ జెండాను ఆ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అబ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎస్.గోపి, వెంకటేష్, అజయ్, ఎస్‌ఏ రాజు, నరసింహులుగౌడ్, బాలరాజ్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

ఆత్మకూర్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతి చెందిన ఘటన ఆత్మకూర్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని మోట్లంపల్లికి చెందిన రాములు (48) గ్రామ శివారులోని కృష్ణానదిలో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం వేటకు వెళ్లిన రాములు రాత్రి అయ్యేదాక రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు కృష్ణానది తీరంలో వెతికారు. ఒడ్డుపై సెల్‌ఫోను, వస్తువులు ఉండడంతో గాలింపు చేపట్టడంతో శవం వలకు చిక్కుకుని ఉండడంతో ఒడ్డుకు చేర్చారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

రహదారులపైనే నూర్పిళ్లు

- ధాన్యం కాంటా కాకపోవడంతో అన్నదాతల అవస్థలు
- భయపెడుతున్న ఈదులుగాలులు, అకాల వర్షాలు



నాగల్‌కడ్మూర్ ప్రధాన రహదారిపై వరిధాన్యం ఆరబోస్తున్న రైతులు

అమరచింత: పండించిన వరి ధాన్యం ఎండిన తర్వాత అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు దాపరించాయి. ధాన్యం ఎండపోవడానికి పంట పొలాల వద్ద స్థలాలు లేకపోవడంతో ప్రధాన బీటీ రహదారులపైనే ఆరబెడుతున్నారు. వాతవరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఎప్పుడు గాలి వీచినా, మేఘావృతమైనా ధాన్యం కాపడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు చెప్పలేని విధంగా ఉంటున్నాయి. వరికుప్పల వద్ద రాత్రివేళలో కాపలా కాస్తు, ఎప్పుడు తమ ధాన్యం కాంటా వేసే సమయం వస్తుందో అని ఎదురు చూస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. సమయానికి తగు విధంగా హమాలీలు లేకపోవడంతో ధాన్యం ఎత్తడానికి జాప్యం జరుగుతుందని వాపోతున్నారు. అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్ ప్రధాన రహదారిపై నిత్యం రైతులు తమ వరిని రహదారిపై ఆరబోస్తూ వాటిని తిరిగి కుప్పలుగా పెడుతుండడంతో అటు వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి హమాలీల కొరత తీర్చి కాంటాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మే 20న దేశంలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని, అన్ని రంగాల కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు బొబ్బిలి నిక్సన్, సునీత, ఆర్ఎస్ రమేష్, రాము, శారద, నారాయణమ్మ, నందిమళ్ల రాములు, శ్రీనివాసులు, జ్యోతి, కవిత, బాలకిష్టమ్మ, పార్వతమ్మ, నిర్మల పాల్గొన్నారు.

‘ఖిల్లా’లో వడగండ్ల వాన

ఖిల్లాఘనపురం: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో ఉన్న వాతావరణం సాయంత్రానికి ఈదురుగాలులు వీచాయి. రాత్రి 7గంటలకు వడగండ్ల వాన కురవడంతో కల్లాల్లో వడ్లు ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద ఎత్తున ఈదురుగాలులు వస్తుండడంతో ధాన్యంపై కప్పిన కవర్లు ఎగిరిపోకుండా కాపలా ఉండాల్సిన దుస్థితి వస్తోంది. దీనికి తోడు ధాన్యం కాంటా చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే గడపాల్సి వస్తోందని వాపోతున్నారు.

కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు

- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం
- వ్యాపారులకు అండగా స్థానిక నాయకులు
- మండలంలో వందల ఎకరాల్లో చేపల సాగు



తిమ్మాపురం సమీపంలో సాగు చేస్తున్న చేపల పెంపకం



జింకలపల్లిలో కోళ్ల వ్యర్థాలను సరఫరా చేస్తున్న దృశ్యం



షేకుపల్లిలో కోళ్ల వ్యర్థాలతో పెంచుతున్న చేపలు

ఎర్రవల్లి: తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించాలన్నా దురుద్దేశంతో చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, కుళ్లిన మాంసం చేపలకు ఆహారంగా వేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ప్రజలు ఆరోగ్యం పాడవుతున్నా, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నా మత్స్యశాఖ, స్థానిక అధికారులు మామూళ్ల మత్తులో చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వందల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం, షేకుపల్లి, సాసనూలు, కొండేరు, జింకలపల్లి, మొగిళిరావుల చెర్వు తదితర గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా వందల ఎకరాల్లో చేపల సాగు చేపట్టారు. చేపలకు మేతగా వేరుశనగచెత్త, తవుడు, సోయాబీన్ మిలెట్‌లను వాడాల్సి ఉంటుంది. కానీ సంప్రదాయ మేతను వేయడం వల్ల నెలకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చును తగించుకునేందుకు గాను కొందరు చేపల చెరువుల యజమానులు కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి దీనికి స్థానిక నాయకులు అండగా ఉండటంతో పట్టపగలే ఆటోలు, వ్యాన్లలో కోళ్ల వ్యర్థాలను కర్నూలు, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా తరలిస్తున్నారు. స్థానిక గ్రామాల ప్రజలు దీనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు సంభందిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వ్యర్థాలే చేపలకు ఆహారం..

సాధారణ మేతను వేయడం వల్ల చేపలు నెలకు అర కేజీ నుంచి కేజీ వరకు మాత్రమే తూకం తూగుతుంది. కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన కోడిగుడ్లను వేయడం వల్ల చేపలు సాధారణ బరువు కంటే రెండు రెట్లు అధికంగా బరువు పెరుగుతాయి. దీంతో అధిక లాభాల పొందవచ్చన్న అత్యాశతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా చేపల సాగు చేస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో వందల ఎకరాల్లో అక్రమంగా చేపల చెరువులు సాగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు జిల్లా మత్స్యశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

చట్టపరమైన చర్యలు



చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన కోడిగుడ్లు వేయడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వం నిషేధించిన వ్యర్థాలతో చేపలను సాగు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– నరేష్, తహసీల్దార్, ఎర్రవల్లి

కేసులు నమోదు చేస్తాం



చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తే వాహనాలు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తాం. పలుమార్లు చికెన్ వ్యర్థాలను తరలిస్తూ పట్టుబడిన వాహనాలను పీఎస్‌కు తరలించి మత్స్యశాఖ అధికారులకు సమాచారం అందించాం.

– రవిబాబు, సీఐ, అలంపూర్